
సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
బుధవారం | 4 | జూన్ | 2025



నాణ్యమైన విద్యకు నవోదయం

జవహర్ నవోదయ విద్యాసమితిలో 6వ తరగతి ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైంది. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యనందించేందుకు 1986లో జవహర్ నవోదయ విద్యాలయాలను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది.


8 లో



ఇద్దరు లారీ డ్రైవర్ల దుర్మరణం

తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు మండలం కాపవరం వద్ద హైవేపై మంగళవారం తెల్లవారుజామున జరిగిన ప్రమాదంలో ఇద్దరు లారీ డ్రైవర్లు మృతి చెందారు.

డెల్టాలకు 500 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు మంగళవారం తూర్పు డెల్టాకు 200, మధ్య డెల్టాకు 100, పశ్చిమ డెల్టాకు 200 కలిపి 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. సముద్రంలోకి 7,437 క్యూసెక్కుల మిగులు జలాలను విడిచిపెట్టారు. బ్యారేజ్ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

కాపులపై కేసులను తిరగతోడడం కక్ష సాధింపే

ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు



అమలాపురంలో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

అమలాపురం టౌన్: కాపులపై కోర్టు కొట్టేసిన కేసులను ఇప్పుడు తిరగతోడడం అంటే కేవలం కక్ష సాధింపు అని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు ఆరోపించారు. కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభంపై ఉన్న ద్వేషంతోనే చంద్రబాబు ప్రభుత్వం ఈ కుట్రకు తెరతీస్తోందని స్పష్టం చేశారు. అమలాపురం హైస్కూలు సెంటరులో గల తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాపులకు విద్య, ఉద్యోగ, ఉపాధి పరంగా రిజర్వేషన్ల కోసం ముద్రగడతోపాటు అనేకమంది కాపు నాయకులు ఉద్యమించారని గుర్తు చేశారు. కేవలం ముద్రగడపై కక్ష సాధింపు కోసం కేసులను తిరగతోడే ప్రయత్నం చేస్తున్న కూటమి ప్రభుత్వం అందుకు ప్రతికూల ఫలితం పొందక తప్పదని ఆయన స్పష్టం చేశారు. 2023లో కాపులపై కేసులను విజయవాడ రైల్వే కోర్టు కొట్టివేస్తే ఇప్పుడు ఈ కేసులపై హైకోర్టులో అప్పీల్ దాఖలు చేయాలని చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం వెనుక కక్ష సాధింపు అనే కుట్ర దాగి ఉందని ఎమ్మెల్సీ అన్నారు. ముద్రగడ కాపుల కోసం చేసిన ఉద్యమాలన్నీ గాంధేయ మార్గంలోనే చేశారని, ఆయనపై చంద్రబాబు ప్రభుత్వం అనేక కేసులు నమోదు చేయడమే పెద్ద తప్పు అయితే ఇప్పుడు కోర్టు కొట్టేసిన కేసులను తిరగతోడాలనుకోవడం మరో అతి పెద్ద తప్పు అన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాపులు, శెట్టిబలిజల మైత్రీ బంధం బలంతో టీడీపీకి గట్టిగా బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

మార్పులపై దృష్టి సారించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈవో బాషా

అమలాపురం టౌన్: నూతన విద్యా సంవత్సరంలో అమలవుతున్న మార్పులపై ప్రత్యేక దృష్టి సారించి ఆ దిశగా బోధన చేయాలని డీఈవో డాక్టర్ షేక్ సలీమ్ బాషా ఉపాధ్యాయులకు సూచించారు. అమలాపురంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన జిల్లా రిసోర్స్ పర్సన్ల శిక్షణ కార్యక్రమంలో డీఈవో బాషా ప్రసంగించారు. జిల్లా విద్యా శాఖ, సమగ్ర శిక్ష సంయుక్త ఆధ్వర్యంలో సెకండరీ స్థాయి ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చేందుకు నియమితులైన జిల్లా రిసోర్స్ పర్సన్లకు మూడు రోజులపాటు శిక్షణ ఇచ్చేందుకు ఈ పాఠశాలలో ఏర్పాట్లు చేసినట్లు డీఈవో బాషా తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని సమగ్ర శిక్ష అదనపు కో ఆర్డినేటర్ జి.మమ్మీ ప్రారంభించారని చెప్పారు. విద్యార్థుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఆన్సర్ బుక్స్, పరీక్షా విధానంలో చోటు చేసుకున్న మార్పులు, తరగతి గది బోధనలో వినియోగించే టీచ్ టూల్స్, అబ్జర్వేషన్ పద్ధతులు, నూతన అకడమిక్ క్యాలెండర్ తదితర అంశాలపై ఈ శిక్షణ ఉంటుందని డీఈవో స్పష్టం చేశారు.

శ్రీరామ నామ సప్తాహం నిర్వహణకు రూ.1.50 లక్షల విరాళం



ద్రాక్షారామలో విరాళం అందజేస్తున్న చెరుకు వీరభద్రరావు, కుటుంబ సభ్యులు

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో వేంచేసియున్న శ్రీ ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద ఈ నెల 2 నుంచి జూలై 21 వరకు 49 రోజుల పాటు నిర్వహిస్తున్న శ్రీరామ నామ సప్త సప్తాహ మహోత్సవం నిర్వహణకు ద్రాక్షారామకు చెందిన చెరుకు వీరభద్రరావు రూ.1,50,000 విరాళంగా తన కుటుంబ సభ్యులతో కలసి అందజేశారు. కార్యక్రమంలో ప్రసన్నాంజనేయ బాలభక్త సమాజం అధ్యక్షుడు బోణం శ్రీను, కైరం వీరవెంకటసత్యనారాయణ(సతార్ స్వామి), చెరుకు బాబూరావు, సలాది బ్రహ్మానందం పాల్గొన్నారు.

● సూపర్ సిక్స్..

వెన్నుపోటు ఫిక్స్!



- కానరాని సంక్షేమం... అక్కరకు రాని సాయం
- కూటమి అధికారంలోకి వచ్చి నేటికి ఏడాది
- సూపర్ సిక్స్‌లో ఒక్క హామీని నెరవేర్చని వైనం
- ఏడాది పాలనపై జిల్లా వాసుల పెదవి విరుపు
- రైతులు, మహిళలు, నిరుద్యోగులు, ఉద్యోగుల్లో అసంతృప్తి
- నేడు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం పేరుతో నిరసనలు

గత సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వచ్చి బుధవారానికి ఏడాది పూర్తి కావస్తోంది. కూటమి ప్రభుత్వానికి పగ్గాలు అప్పగించి కూడా ఏడాది అవుతోంది. నాటి నుంచి నేటి వరకు ఏడాది పాటు ప్రశ్నిస్తే అణచివేయడం, రెడ్‌బుక్ పేరుతో అరాచకం, ఇసుక తవ్వకాలు, ప్రభుత్వ కార్యక్రమాలలో అక్రమాలు ఇలా సాగిపోతోంది పాలన. పేద, బడుగు, బలహీన వర్గాల వారికి, దళితులకు, మహిళలకు అందాల్సిన సంక్షేమ పథకాలు దాదాపు నిలిచిపోయాయి. రైతులు, నిరుద్యోగులు వంటి వారికి ప్రభుత్వ పరంగా అందాల్సిన సాయం ఆగిపోయింది. మొత్తం మీద కూటమి ఏడాది పాలన సామాన్య ప్రజలకు దగా... మోసం అన్నట్టుగా సాగిపోయింది. సర్కారు నిర్వాకంపై నేడు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం పేరుతో జిల్లావ్యాప్తంగా నిరసనలు చేపట్టనున్నారు.

సాక్షి, అమలాపురం: ఇచ్చిన మాటకు కట్టుబడి ఎన్నికల ముందు ప్రకటించిన మేనిఫెస్టోను తు.చ. తప్పకుండా అమలు చేసిన ఘనత గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిది. ఎన్నికల ఫలితాలు వచ్చాక మేనిఫెస్టోను మడతపెట్టి అవతల పాడేయాలి అనే సూత్రాన్ని కూటమి ప్రభుత్వం ఒంట బట్టించుకుంది. తాము అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్‌ను అమలు చేస్తామని ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికలకు ఏడాదిన్నర ముందు నుంచి ప్రచారం ప్రారంభించారు. బాబు ష్యూరిటీ... భవిష్యత్తు గ్యారంటీ పేరుతో రాష్ట్రవ్యాప్తంగా తిరుగుతూ చంద్రబాబు సూపర్ సిక్స్ పేరుతో హామీల వర్షం కురిపించారు. తర్వాత బాబుతో జట్టు కట్టిన ప్రస్తుత ఉపముఖ్యమంత్రి జనసేన అధినేత పవన్ కల్యాణ్ సైతం సూపర్ సిక్స్ అమలు బాధ్యత తాను తీసుకుంటానని గొప్పగా చెప్పుకున్నారు. కానీ వాస్తవంగా దానిలో ఒక్క పథకాన్ని కూడా ఇప్పటి వరకు సంపూర్ణంగా అమలు చేయలేదు.

సూపర్ సిక్స్ హామీ-1

యువతకు 20 లక్షల ఉద్యోగాలు లేదా నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి

నిరుద్యోగ భృతిని ప్రభుత్వం విజయవంతంగా ఎగ్గొట్టింది. జిల్లాలో 50 వేల మంది నిరుద్యోగులు ఉన్నారని అంచనా. నెలకు రూ. 3వేల చొప్పున రూ.180 కోట్లను విజయవంతంగా ఎగ్గొట్టేసింది. కొత్తగా ఉద్యోగాల మాట అటు ఉంచి, తొమ్మిది వేల మందినికి పైగా ఉన్న వలంటీర్ల వ్యవస్థను ఎత్తివేసింది. ఇంటింటా ఇచ్చే రేషన్ ఎండీయూ వ్యవస్థను రద్దు చేసి కొత్త నిరుద్యోగులను సృష్టించింది. అధికారంలోకి రాగానే డీఎస్సీ నోటిఫికేషన్ ఫైల్‌పై సంతకం చేసి ఈ రోజుకి పూర్తి చేయలేదు.

సూపర్ సిక్స్ హామీ-2

స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15 వేలు

గత ప్రభుత్వం అమ్మ ఒడి రూపంలో అర్హులైన ప్రతి కుటుంబంలోని ఒక విద్యార్థికి రూ.15 వేల చొప్పున అందించింది. ఎన్నికల మేనిఫెస్టోలో కూటమి ప్రభుత్వం పాఠశాలలో చదివే ప్రతి ఒక్కరికి తల్లికి వందనం పేరుతో రూ.15 వేలు ఇస్తానంది. ఈ లెక్కన చూస్తే జిల్లాలో 1.45 లక్షల మంది విద్యార్థులకు ఏడాదికి రూ.217.50 కోట్లు అందించాల్సి ఉంది. గత ఏడాది సొమ్మును కూటమి ప్రభుత్వం విజయవంతంగా ఎగొట్టింది. ఈ ఏడాది ఇస్తానని ప్రకటించినా ఏదో వంకతో లబ్ధిదారులను కుదించి వేస్తుందని ప్రచారం జోరుగా సాగుతోంది.



గోదావరిలో అడ్డగోలుగా ఇసుక తవ్వకాలు

నిరసనల పథం

కూటమి ప్రభుత్వ విధానాలపై విసిగి వేసారిన పలు ప్రజా సంఘాలు, ఆయా వర్గాలవారు తమ నిరసనను బహిరంగంగానే వెళ్లగక్కుతున్నారు. కలెక్టరేట్ వద్ద ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక సందర్భంగా పలు సంఘాల వారు నిరసనలు, ధర్నాలతో హోరెత్తిస్తున్నారు. రాజోలు బీసీ సంక్షేమ శాఖ వసతిగృహం వద్ద నిరసన ప్రదర్శనలు జరిగాయి. అంగన్ వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్ల నిరసనను కలెక్టరేట్ వద్ద గేట్లు బంద్ చేసి పోలీసులు అడ్డుకున్నారు. సీహెచ్‌వోలు, వ్యవసాయ కార్మికులు, యానిమేటర్లు ఇలా పలు సంఘాలు ఆందోళనలు చేస్తున్నాయి. జీతం బకాయిలు చెల్లించాల్సి ఉందని సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పారిశుధ్య కార్మికులు, వాచ్‌మన్‌లు ఆందోళన చేశారు.

సూపర్ సిక్స్ హామీ- 3

ప్రతి రైతుకు ఏటా రూ. 20వేల సాయం

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతు భరోసా పేరుతో ఏటా మూడు దఫాలుగా రైతులు ఖాతాలో సొమ్ము జమ చేసేది. రైతుకు ఏటా 13,500 చొప్పున ఆర్థిక సహాయాన్ని ఐదేళ్లపాటు అందించింది. టీడీపీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రతి రైతుకు రూ.20వేల చొప్పున అందిస్తామని చెప్పింది. దీనికి అన్నదాత సుఖీభవ అనే పేరు కూడా పెట్టింది. గత ఏడాది ఇవ్వాల్సిన సొమ్ము రూ.480 కోట్ల దిక్కూ మొక్కూ లేదు. ఈ ఏడాది ఇస్తామని చెబుతున్నప్పటికీ ఎంత అనేది మాత్రం ప్రకటించలేదు. గత ప్రభుత్వం ఇచ్చినట్టుగా కూటమి ప్రభుత్వం కూడా ఇవ్వాల్సి వస్తే జిల్లాలో 1,45,890 మంది రైతులకు రూ.482.50 కోట్లు ఇవ్వాల్సి ఉంది.

సూపర్ సిక్స్ హామీ-4

ప్రతి ఇంటికీ ఉచితంగా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్‌లు

జిల్లాలో 3.90 లక్షల మంది వరకు గ్యాస్ వినియోగదారులున్నారని అంచనా. వీరికి ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇవ్వాల్సి ఉండగా, గత ఏడాది కేవలం ఒక సిలిండరు మాత్రమే ఉచితంగా అందించారు. అది కూడా లబ్ధిదారులలో సగం మందికే.

ఇసుక దోపిడీ

రాష్ట్రంలో అధికారం మారిన జూన్ 4వ తేదీ రాత్రి నుంచి జిల్లాలో ఇసుక దోపిడీ మొదలై ఇప్పటి వరకు నిర్విఘ్నంగా కొనసాగుతోంది. అంతకు ముందు ప్రభుత్వం ముందస్తుగా నిల్వ ఉంచిన ఇసుక స్టాక్ పాయింట్ల నుంచి ఇసుకను కొల్లగొట్టుకుపోయారు. లారీకి అదనంగా రూ.ఐదు వేల చొప్పున దోపిడీ చేశారు. ప్రభుత్వ అధికారిక ర్యాంపులలోనే బరి తెగించి అక్రమాలకు పాల్పడ్డారు. మూసివేసిన ర్యాంపులలో ఇప్పటికీ ఇసుక తవ్వకాలు సాగుతున్నాయి. రోజూ రూ.కోట్ల విలువైన ఇసుకను తవ్వుకుపోతున్నారు. పి.గన్నవరం, ముమ్మిడివరం, అయినవిల్లి, అల్లవరం, కాట్రేనికోన, మామిడికుదురు, మలికిపురం, రాజోలు ఇలా చెప్పుకుంటూ పోతే గోదావరి ప్రవహించే ప్రతి చోటా అక్రమ ఇసుక ర్యాంపులు పుట్టగొడుగుల్లా పుట్టుకు వస్తున్నాయి. లంక మట్టితోపాటు సముద్రతీరంలోని ఇసుకను పెద్ద ఎత్తున తవ్వేస్తూ దోపిడీకి పాల్పడుతున్నారు.

సూపర్ సిక్స్ హామీ-5

ప్రతి మహిళకు నెలకు రూ.1,500

అధికారంలోకి రాగానే అర్హత ఉన్న ప్రతి మహిళకు నెలకు రూ.1,500 చొప్పున ఖాతాలో జమ చేస్తామని చెప్పి అధికారం చేపట్టి ఏడాది కావస్తున్నా ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా మహిళల ఖాతాలో జమ చేయలేదు. 18 ఏళ్ల వయసు దాటిన వారి నుంచి 60 ఏళ్ల లోపు వారు ఈ పథకానికి అర్హులని తెలిసింది. ఈ విధంగా చూస్తే జిల్లాలో కనీసం 4.50 లక్షల మంది వరకు అర్హులు ఉన్నట్టుగా అంచనా. నెలకు రూ.1,500 చొప్పున ఏడాదికి రూ.18 వేలు ఇవ్వాల్సి ఉంది. ఏడాది కాలంలో జిల్లాలో మహిళలకు రూ.810 కోట్లను కూటమి ప్రభుత్వం బకాయి పడినట్టయ్యింది.

సూపర్ సిక్స్ హామీ - 6

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం అమలులో ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. దీని అమలును దఫ దఫాలుగా వాయిదా వేసుకుంటూ వస్తోంది. ఇప్పుడు తాజాగా దీనిని ఆగస్టు 15 స్వతంత్ర దినోత్సవం నాటి నుంచి అమలు చేస్తామని చెబుతోంది. ఈ పథకం అమలుపై ప్రభుత్వం ఏడాది కాలంగా ఇంకా విధివిధానాల రూపకల్పనలోనే ఉన్నట్టు చెబుతుండటం విశేషం. ఉచిత ఆర్టీసీ ప్రయాణం అమలు అయితే జిల్లాలో సుమారు తొమ్మిది లక్షల మంది మహిళలకు ప్రయోజనం చేకూరుతుంది.

బాబూ... పవన్ హామీలు గుర్తున్నాయా?

ఎన్నికల ముందు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పర్యటన సందర్భంగా జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఇచ్చిన హామీల్లో కొన్ని..

- నదీ పరివాహక ప్రాంతంలో ఇసుకను ఉచితంగా అందించి భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం
- కల్లుగీత కార్మికుల నుంచి వృత్తి పన్ను వసూలు చేయకుండా వారు ఉచితంగా కల్లు గీసుకునే వెసులుబాటు
- సఖినేటిపల్లి- నరసాపురం వంతెన నిర్మాణ పనులు పూర్తికి కృషి
- కోనసీమ టూరిజం హబ్‌గా మార్పు
- జిల్లా వ్యాప్తంగా గోదావరి నదీ కోత నివారణకు గ్రోయిన్లు, రివిట్‌మెంట్ల నిర్మాణం
- వరదల సమయంలో కె.ఏనుగుపల్లి, ఎదురుబిడియం కాజ్‌వేలు ముంపుబారిన పడకుండా వంతెనల నిర్మాణం
- అప్పనపల్లి ఎత్తిపోతల పథకం ద్వారా సాగు, తాగునీరు
- కొబ్బరి అభివృద్ధి బోర్డు (సీడీబీ)ని కోనసీమకు తీసుకురావడం. కొబ్బరి పరిశ్రమల ఏర్పాటు. నైపుణ్యాభివృద్ధి ద్వారా చిన్న పరిశ్రమల ఏర్పాటు. కొబ్బరిలో నాణ్యమైన మొక్కలను స్థానికులకు అందేలా చర్యలు
- కోనసీమ రైల్వేలైన్ త్వరితగతిన పూర్తి

రెడ్‌బుక్ రాజ్యాంగం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జిల్లాలో రెడ్‌బుక్ రాజ్యాంగం విజయవంతంగా నడుస్తోంది. సామాన్య కార్యకర్త నుంచి మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులపై ఎడాపెడా కేసులు పెడుతూనే ఉన్నారు. రావులపాలెంలో కొత్తపేట మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావులతోపాటు 41 మందిపై రావులపాలెం పోలీస్ స్టేషన్‌లో 2025 జనవరి 31వ తేదీన మూడు కేసులు నమోదు చేశారు. సోషల్ మీడియా యాక్టివిస్టులను సైతం ఇష్టానుసారం అరెస్టు చేశారు. జిల్లాలో నలుగురిపై కేసులు నమోదు చేసి వారిలో ఒకరిని జైలుకు పంపించారు.

మహిళలకు న్యాయం చేయాలి



ఎన్నికల ముందు మహిళలకు నెలకు ఇస్తానన్న రూ.1,500 తక్షణం ఇవ్వాలి. ప్రతి నెలా అందించడంతోపాటు ఇప్పటి వరకు ఇవ్వాల్సిన సొమ్ము కూడా విడుదల చేయాల్సి ఉంది.

– ఎం.పుణ్యవతి లక్ష్మి, తాటిపాక, రాజోలు మండలం

అమ్మ ఒడి జమ కాలేదు



మా ఇద్దరు పిల్లలు ప్రభుత్వ పాఠశాలలోనే చదువుతున్నారు. మా పెద్ద బాబు గౌతమ్ 5వ తరగతి, చిన్నబాబు నిఖిల్ 3వ తరగతి చదువుతున్నాడు. ఈ ఏడాది అమ్మ ఒడి ఇంకా ఖాతాలో జమ కాలేదు.

– గోసాల చిన్నిదుర్గ, గృహిణి, రాయవరం

కొబ్బరి రైతులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి



ఎన్నికల వేళ పవన్ కల్యాణ్ అంబాజీపేటలో కొబ్బరి అభివృద్ధి బోర్డుని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఏడాది గడుస్తున్నప్పటికీ ఏర్పాటు చేయలేదు. అది ఏర్పాటు చేస్తే రైతులు, నిరుద్యోగులు, మహిళలకు ఉపయోగపడుతుంది. – కొప్పిశెట్టి ఆనంద వెంకట ప్రసాద్, శ్రీ వ్యాఘ్రేశ్వరా ఐక్య రైతు సంఘం అధ్యక్షుడు.



కలెక్టరేట్‌కు వస్తున్న ఆశా వర్కర్లను గేట్లు బంద్ చేసి అడ్డుకుంటున్న పోలీసులు

ఇంటర్ తరగతులు ప్రారంభం

- అంతంత మాత్రంగా హాజరు
- జిల్లాలో 136 కళాశాలలు

రాయవరం: జిల్లాలో ఇంటర్మీడియెట్ కళాశాలలు సోమవారం పునఃప్రారంభమయ్యాయి. పదవ తరగతి అనంతరం ఇంటర్‌లో చేరిన విద్యార్థులు తరగతులకు హాజరయ్యారు. అయితే రోహిణి కార్తె ప్రభావంతో ఎండలు మండుతుండడంతో విద్యార్థుల హాజరు తక్కువగా ఉంది. 2025–26 విద్యా సంవత్సరానికి అకడమిక్ క్యాలండర్‌ను ఇంటర్మీడియెట్ బోర్డు విడుదల చేసింది.

ప్రవేశాలు అంతంత మాత్రం

మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం ఇప్పటికే ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు అడ్మిషన్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ కళాశాలల్లో అందుబాటులో ఉన్న వసతులు, సౌకర్యాలు, ల్యాబ్‌లు, డిజిటల్ విద్య, ఐఎఫ్‌పీ ప్యానెల్స్ ద్వారా బోధన, ఇంటర్ విద్యతో లభిస్తున్న భవిష్యత్ అవకాశాలను వివరిస్తున్నారు.

జిల్లాలో కళాశాలల పరిస్థితి ఇదీ..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలో 136 కళాశాలలున్నాయి. 13 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, ఒక ఎయిడెడ్ జూనియర్ కళాశాల, సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలో ఆరు, ఒకేషనల్ జూనియర్ కళాశాలలు 18, ప్రైవేట్ అన్ ఎయిడెడ్ జూనియర్ కళాశాలలు 67, హైస్కూల్ ప్లస్‌లు 31 ఉన్నాయి. గత విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో 17,253 మంది ఉత్తీర్ణత సాధించగా, వీరిలో అధిక సంఖ్యలో విద్యార్థులు ఇంటర్మీడియెట్‌లో చేరనున్నారు. గత విద్యా సంవత్సరంలో ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులు 12,613 మంది ఈ ఏడాది ఇంటర్ సెకండియర్ విద్యను అభ్యసిస్తారు.



ప్రభుత్వ జూనియర్ కళాశాల

235 పనిదినాలు

ఇంటర్మీడియెట్ బోర్డు అకడమిక్ క్యాలండర్‌ను ఏప్రిల్‌లోనే విడుదల చేశారు. ఈ ఏడాది ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైంది. ఏప్రిల్ 24 నుంచి జూన్ ఒకటో తేదీ వరకు వేసవి సెలవులు ప్రకటించారు. నూతన అకడమిక్ క్యాలండర్ ప్రకారం 2025–26 విద్యా సంవత్సరంలో 235 పనిదినాలు ఉంటాయి. మొత్తం 314 రోజులకు 79 రోజులు సెలవు దినాలున్నాయి. జూలై 17 నుంచి 19 వరకు యూనిట్–1, ఆగస్టు 18 నుంచి 20 వరకు యూనిట్–2, సెప్టెంబర్ 15 నుంచి 20 వరకు క్వార్టర్లీ పరీక్షలు నిర్వహిస్తారు. సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ 5 వరకు దసరా సెలవులు ఇస్తారు. అక్టోబరు 22 నుంచి 24 వరకు యూనిట్–3, నవంబరు 17 నుంచి 22 వరకు అర్ధ సంవత్సర పరీక్షలు, డిసెంబరు 15 నుంచి 20 వరకు ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహిస్తారు. వచ్చే ఏడాది జనవరి 10 నుంచి 18 వరకు సంక్రాంతి సెలవులు ఇవ్వనున్నారు. జనవరి 21 నుంచి 28 వరకు ప్రీ ఫైనల్–2 పరీక్షలు నిర్వహిస్తారు. ఫిబ్రవరిలో ప్రాక్టికల్స్, ఫిబ్రవరి, మార్చి నెలల్లో పబ్లిక్ పరీక్షలు నిర్వహిస్తారు, 2025–26 విద్యా సంవత్సరానికి వచ్చే ఏడాది మార్చి 18 చివరి పనిదినంగా నిర్ణయించారు.

వెన్నుపోటులో సిద్ధహస్తుడు చంద్రబాబు

- మాజీ ఎమ్మెల్యే, జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు జగ్గిరెడ్డి
- నేడు అన్ని నియోజకవర్గాల్లో వెన్నుపోటు దినం పేరిట నిరసనలు



కొత్తపేట: నమ్మిన వారిని వెన్నుపోటు పొడవటంలో చంద్రబాబునాయుడు సిద్ధహస్తుడని మాజీ ఎమ్మెల్యే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వ తీరుకు నిరసనగా బుధవారం 'వెన్నుపోటు దినం' పేరిట అన్ని నియోజకవర్గాల్లో నిరసన కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టనున్నట్టు తెలిపారు. మంగళవారం ఆయన రావులపాలెం మండలం గోపాలపురంలో మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులు, ప్రజలకు పిలుపునిచ్చారు. గడచిన ఎన్నికల్లో నోటికొచ్చిన హామీలతో ప్రజలను నమ్మించి అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం వాటి అమలును గాలికొదిలేసిందని ధ్వజమెత్తారు. ఈ ఏడాది కాలంలో ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టిన పథకాలనూ నేడు నిలిపివేసి పేదలను అన్ని విధాలుగా కూటమి ప్రభుత్వం ఇబ్బందులు పెడుతోందన్నారు. కరెంటు చార్జీలు, నిత్యావసర సరకుల ధరలు పెంచి, ప్రజలపై భారం మోపిందన్నారు. సీఎం చంద్రబాబుకు అమరావతి తప్ప ఏమీ కనిపించడం లేదని విమర్శించారు. అందుకే ఎన్నికలు జరిగి జూన్ 4కు ఏడాది అవుతున్నందున వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు వెన్నుపోటు దినం నిర్వహిస్తున్నామన్నారు. సీఎం చంద్రబాబు మోసాలను ఎండగడతామని, హామీలు నెరవేర్చే వరకూ ప్రతిపక్షంగా ప్రజల పక్షాన పోరాటం సాగిస్తామన్నారు.

నియోజకవర్గంలో కార్యక్రమం ఇలా..

కొత్తపేట నియోజకవర్గం వెన్నుపోటు దినం కార్యక్రమాలను జగ్గిరెడ్డి వివరించారు. బుధవారం ఉదయం 9.30 గంటలకు నియోజకవర్గంలో 4 మండలాల నుంచి పార్టీ శ్రేణులు రావులపాలెంలో వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్దకు చేరుకుంటారు. 10 గంటలకు అక్కడి నుంచి నిరసన ర్యాలీ ప్రారంభమై రావులపాడు రోడ్డు వరకూ సాగి అక్కడి నుంచి యూటర్న్ తీసుకుని తిరిగి ఆంజనేయస్వామి గుడి మీదుగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని మెమోరాండం సమర్పిస్తామని తెలిపారు.

యోగాతో పరవశించిన సాగర తీరం



అంతర్వేది సాగర తీరంలో యోగాసనాలు వేస్తున్న దృశ్యం

సఖినేటిపల్లి/మలికిపురం: అంతర్వేది సాగర తీరం మంగళవారం యోగాతో పరవశించింది. సుమారు 3 వేల మందితో నిర్వహించిన ఈ కార్యక్రమం సముద్ర తరంగాల సాక్షిగా, సూర్యోదయ కిరణాల మధ్య శరీరం, మనసు, శ్వాసలు సమన్వయంతో ఒక్కటై యోగా ముద్ర వేశాయి. అంతర్వేది బీచ్‌లో యోగాంధ్ర 2025 పేరిట ఈ కార్యక్రమం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి పాల్గొని మాట్లాడుతూ ప్రతి రోజూ కేవలం పది నిమిషాలైనా యోగా చేయడం వల్ల జీవితంలో గొప్ప మార్పులు వస్తాయన్నారు. జిల్లా యంత్రాంగం ఆహ్వానంతో యోగా కార్యక్రమానికి హాజరైన ప్రముఖ సోషల్ మీడియా యోగా యాక్టివిస్ట్ లక్కవరంనకు చెందిన వేగేశ్న పూజాకు ధన్యవాదాలు తెలియజేశారు. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ మాట్లాడుతూ యోగాంధ్ర పేరిట రాష్ట్రవ్యాప్తంగా యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. డీఆర్‌ఓ బి. రాజకుమారి, అమలాపురం ఆర్డీవో కె.మాధవి, డీఈఓ షేక్ సలీంబాషా, పీడీ డ్వామా మధుసూదన్, జి.ఎస్.డబ్ల్యూఎస్ నోడల్ ఆఫీసర్ రాజేశ్వరరావు, జిల్లా సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్ ఎస్.కె.నవాబ్ జాన్ జిల్లా అధికారులు, మాజీ సైనికులు, యువకులు, విద్యార్థులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

క్లుప్తంగా

జేఈఈలో ప్రవీణ్‌కుమార్‌కు 328వ ర్యాంకు



మామిడికుదురు: ఎంతో ప్రతిష్టాత్మకంగా జరిగిన జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో పాశర్లపూడిలంకకు చెందిన కోలా ప్రవీణ్‌కుమార్ సత్తా చాటాడు. ఇతను జాతీయ స్థాయిలో 328వ ర్యాంకు సాధించాడు. విజయవాడ ప్రైవేటు కళాశాలలో చదువుతున్న ప్రవీణ్‌కుమార్‌కు ముంబయి సీఎస్‌ఈలో సీటు వచ్చింది. తండ్రి గోపాలకృష్ణ రైతు, తల్లి జ్యోతి గృహిణి. పేరెంట్స్ ఎంతో కష్టపడి కొడుకును చదివించారు. ప్రతి రోజు 14 గంటలు చదవడం వల్ల మంచి ర్యాంకు వచ్చిందని ప్రవీణ్‌కుమార్ మంగళవారం తెలిపాడు. సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడాలన్నదే తన లక్ష్యమని తెలిపాడు. అతడిని స్థానికులు అభినందించారు.

మద్యం తాగి బైక్ నడిపిన వారికి జైలు

కాకినాడ లీగల్: మద్యం తాగి బైక్ నడిపిన కేసుల్లో ఒకరికి ఐదురోజులు, తొమ్మిది మందికి రెండు రోజుల చొప్పున జైలు, 17 మందికి రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ కాకినాడ మూడో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ డి.శ్రీదేవి తీర్పు చెప్పారు. కాకినాడ ట్రాఫిక్–1, 2 పోలీసు స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. మంగళవారం కోర్టులో 27 మందిని హాజరుపర్చగా వారికి పై విధంగా జైలు, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

పోలీసుల అదుపులో కారు యజమాని



పోలీసులు స్వాధీనం చేసుకున్న రోడ్డు ప్రమాదానికి కారణమైన కారు

అమలాపురం టౌన్: స్థానిక ఏఎస్‌ఏ ఆస్పత్రి వద్ద 216 జాతీయ రహదారిపై ఓ మోటారు సైకిలిస్టును ఢీకొట్టి తీవ్రంగా గాయపరచడమే కాకుండా అక్కడ నుంచి కారుతో సహా పరారైన వ్యక్తిని పట్టణ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. ఆ కారు యజమాని దీపక్‌ను అదుపులోకి తీసుకుని రోడ్డు ప్రమాదంలో ఉపయోగించిన కారును స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ ఎస్సై ఎస్‌ఆర్ కిషోర్‌బాబు తెలిపారు. స్థానిక పితానివానిపాలేనికి చెందిన దీపక్ స్థానికంగా రోల్స్ ఆన్ రోడ్డు పేరుతో హోటల్ నిర్వహిస్తున్నాడని ఎస్సై పేర్కొన్నారు. పట్టణ సీఐ పి.వీరబాబు పర్యవేక్షణలో కేసును విచారిస్తున్నామని తెలిపారు. రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి అమలాపురంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

నాణ్యమైన విద్యకు నవోదయం

- 2026–27 విద్యా సంవత్సరానికి నోటిఫికేషన్ విడుదల
- జూలై 29 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణకు తుది గడువు
- ఈ ఏడాది డిసెంబర్ 13న ప్రవేశ పరీక్ష



రాయవరం: జవహర్ నవోదయ విద్యాసమితిలో 6వ తరగతి ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైంది. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యనందించేందుకు 1986లో జవహర్ నవోదయ విద్యాలయాలను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దేశవ్యాప్తంగా 661 నవోదయ విద్యాలయాలు ఉండగా..కాకినాడ జిల్లా పెద్దాపురంలో ఉంది. కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని విద్యార్థులు ఇక్కడ దరఖాస్తుకు అర్హులు. 2026–27 విద్యా సంవత్సరానికి ఆరవ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఆరవ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు ఉచిత విద్యను ఇక్కడ అందిస్తారు. విద్యతో పాటు అధునాతన సౌకర్యాల కల్పన, ప్రయోగాత్మక విద్య, క్రీడలు, క్రమశిక్షణ, ప్రతిభకు పెద్దపీట వేయడం ఈ విద్యా సంస్థల ప్రత్యేకత. పరీక్షకు ఎవరు అర్హులు, పరీక్షా విధానం, రిజర్వేషన్ తదితర వివరాలతో 'సాక్షి' ప్రత్యేక కథనం.

ఒక్కసారే అవకాశం

ఈ ఏడాది డిసెంబర్ 13న నిర్వహించే ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన వారికి విద్యాలయంలో ప్రవేశం లభిస్తుంది. ఆన్‌లైన్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. పెద్దాపురం జవహర్ నవోదయ విద్యాలయాల్లో మొత్తం 80 సీట్లు ఉంటాయి. ఆరవ తరగతిలో ప్రవేశానికి ప్రస్తుతం ఆయా మండలాల్లో ఐదో తరగతి చదువుతున్న బాలబాలికలు అర్హులు. ఈ ప్రవేశ పరీక్షకు ఒక్కసారి మాత్రమే హాజరయ్యే అవకాశం ఉంది.

2026–27 విద్యా సంవత్సరంలో అడ్మిషన్ పొందగోరే బాలబాలికలు 2014 మే ఒకటో తేదీ నుంచి 2016 జూలై 31 మధ్య జన్మించి ఉండాలి. ప్రభుత్వం గుర్తించిన పాఠశాలల్లో 3,4 తరగతులు ఉత్తీర్ణత సాధించి ఐదో తరగతి చదువుతున్న వారు మాత్రమే అర్హులు.

రిజర్వేషన్ విధానం

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు 75 శాతం తగ్గకుండా సీట్లు కేటాయిస్తారు. షెడ్యూల్ కులాలకు 15 శాతం, షెడ్యూల్ తరగతులకు ఏడు శాతం, దివ్యాంగులకు మూడు శాతం రిజర్వేషన్ కల్పిస్తారు. ప్రవేశాల్లో బాలికలకు 33 శాతం రిజర్వేషన్లు వర్తింపజేస్తారు.

వసతులు

బాలబాలికలకు వసతి గృహాలు, భోజనం, విద్య, నోట్‌బుక్స్, స్కూల్ యూనిఫామ్, షూస్, టాయిలెట్ సామగ్రి ఉచితం. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు నవోదయ విద్యాలయాల్లో బోధన చేస్తారు. శాస్త్ర, సాంకేతికతతో కూడిన విద్య, క్రీడలు, యోగా ద్వారా విద్యార్థికి సంపూర్ణ వ్యక్తిత్వ వికాసం కల్పిస్తారు. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ వరకు నామమాత్రపు రుసుం ఉంటుంది. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు, బాలికలకు ఫీజు నుంచి మినహాయింపు ఉంటుంది. ఆన్‌లైన్ దరఖాస్తును పూర్తి చేసిన తర్వాత దరఖాస్తు ఫారాన్ని ప్రింట్ తీసుకుని దగ్గర ఉంచుకోవాలి. హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవడానికి ఇది ఉపకరిస్తుంది. జూలై 29వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు అందజేయాల్సి ఉంది. దరఖాస్తుకు రుసుం చెల్లించనవసరం లేదు.

పరీక్షా విధానమిదీ..

నవోదయ ప్రవేశ పరీక్షను 2025 డిసెంబరు 13న ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహిస్తారు. విద్యార్థులు భాషను(తెలుగు/ఇంగ్లీషు) ఎంచుకొని పరీక్ష రాసే వీలుంది. ప్రవేశ పరీక్షలో 80 ప్రశ్నలు ఉంటాయి. ఆబ్జెక్టివ్ విధానంలో 100 మార్కులకు పరీక్ష నిర్వహియిస్తారు. మూడు విభాగాల్లో ప్రశ్నలు కేటాయిస్తారు. మేధాశక్తిపై 40 ప్రశ్నలు 50 మార్కులకు, గణితం(అర్థమెటిక్), ఎంచుకున్న భాషపై ఒక్కొక్క విభాగానికి 20 ప్రశ్నలు వంతున 40 ప్రశ్నలు 50 మార్కులకు ఉంటాయి. తప్పుడు సమాధానాలకు నెగిటివ్ మార్కులు ఉండవు. దివ్యాంగులకు 40 నిమిషాల అదనపు సమయాన్ని కేటాయిస్తారు. పరీక్షలను సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్‌ఈ) నిర్వహిస్తుంది. ఎంపికైన వారికి మొదటి రెండు సంవత్సరాలు తెలుగు/ఇంగ్లిషు భాషల్లో బోధిస్తారు. అనంతరం ఇంగ్లిషులోనే బోధన చేస్తారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు హెచ్‌టీటీపీఎస్://నవోదయ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

గతేడాది జిల్లాల వారీగా వచ్చిన దరఖాస్తులు ఇలా..

జిల్లా	వచ్చిన దరఖాస్తులు
కోనసీమ	3,869
తూర్పుగోదావరి	1,741
కాకినాడ	3,361

అధికారులు అవగాహన కల్పించాలి



అధిక సంఖ్యలో విద్యార్థులు హాజరయ్యేలా విద్యాశాఖ అధికారులు అవగాహన కల్పించాలి. గతేడాదికి మించి దరఖాస్తులు వచ్చేలా ఎంఈవోలు పర్యవేక్షణ చేయాలి

– బి.సీతాలక్ష్మి, ప్రిన్సిపాల్, జవహర్ నవోదయ విద్యాలయ, పెద్దాపురం

ఇద్దరు లారీ డ్రైవర్ల దుర్మరణం



కాపవరం వద్ద జరిగిన ప్రమాదంలో దెబ్బతిన్న లారీ

తాళ్లపూడి (కొవ్వూరు): కొవ్వూరు మండలం కాపవరం వద్ద హైవే పై మంగళవారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు లారీ డ్రైవర్లు మృతి చెందారు. కొవ్వూరు ఎస్సై శ్రీహరిరావు తెలిపిన వివరాల ప్రకారం లారీ డ్రైవర్ బత్తుల శీనయ్య(40) హైదరాబాద్ నుంచి మండపేటకు ధాన్యం లోడుతో వస్తున్నాడు. కాపవరం వద్దకు వచ్చే సరికి కునుకుపాటుకు గురై ముందు వెళుతున్న గుర్తు తెలియని వాహనాన్ని ఢీకొట్టి అనంతరం రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టడంతో లారీ ఆగిపోయింది. ఈ లారీని ఇతర వాహనాలకు ఢీకొనకుండా, శీనయ్య కిందకు దిగి డైరెక్షన్ ఇస్తూ దారి చూపుతున్నాడు. ఇంతలో జంగారెడ్డిగూడెం నుంచి ధాన్యం లోడుతో వస్తున్న మరో లారీ.. శీనయ్య లారీని బలంగా ఢీకొట్టడంతో అందులోని డ్రైవర్ కొయ్యే బాబూరావు(40) లారీ క్యాబిన్లో ఇరుకుపోయి మృతి చెందాడు. డైరెక్షన్ ఇస్తున్న బత్తుల శీనయ్య కూడా ఐచర్ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. మృతదేహాలను కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం కోసం తరలించారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై శ్రీహరి తెలిపారు.

అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలకు జట్టు ఎంపిక



పురుషుల క్రికెట్ జట్టు



మహిళల క్రికెట్ జట్టు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): విజయనగరం జిల్లాలో 4 నుంచి 7 వరకు జరిగే ఏసీఏ నార్త్ జోన్ క్రికెట్ పోటీలలో పాల్గొనే పురుషుల జిల్లా జట్టు ఎంపికను మంగళవారం నిర్వహించినట్లు తూర్పుగోదావరి జిల్లా క్రికెట్ సంఘ కార్యదర్శి సత్యనారాయణ తెలిపారు. స్థానిక ఆర్ఎంసీ క్రీడామైదానంలో నిర్వహించిన సెలెక్షన్స్‌లో 15 మందిని ఎంపిక చేశామన్నారు. ఈ నెల 9 నుంచి 12 వరకు జరిగే ఏసీఏ నార్త్ జోన్ మహిళల అంతర్ జిల్లా క్రికెట్ పోటీలకు జిల్లా మహిళా క్రికెట్ జట్టు ఎంపికను నిర్వహించామని పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులకు జిల్లా క్రికెట్ సంఘం తరఫున క్రీడాదుస్తులు అందజేశామని తెలిపారు.

ఉత్కంఠగా సీనియర్ ఓపెన్ చెస్ పోటీలు



రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఎంపికైన విజేతలతో జిల్లా చెస్ అసోసియేషన్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక విద్యానిధి విద్యాసంస్థల ప్రాంగణంలో మంగళవారం జరిగిన సీనియర్ ఓపెన్ చెస్ జిల్లా స్థాయి పోటీలు ఉత్కంఠగా జరిగాయి. ఈ జిల్లా స్థాయి పోటీల్లో మొదటి నాలుగు స్థానాలు సాధించిన విజేతలను రాష్ట్ర స్థాయి సీనియర్ ఓపెన్ చెస్ చాంపియన్ షిప్ పోటీలకు ఎంపిక చేసినట్లు జిల్లా చెస్ అసోసియేషన్ సెక్రటరీ తాడి వెంకట సురేష్ తెలిపారు. ద్రాక్షారామ సాత్విక్ (ప్రథమ), తాడి వెంకటేష్ (ద్వితీయ), బండారు నానిబాబు (తృతీయ), పి.ధరణి (4వ స్థానం) సాధించారని చెప్పారు. ఈ నలుగురు విజేతలు ఈనెల 6వ తేదీన విజయవాడలో జరగనున్న రాష్ట్ర స్థాయి సీనియర్ ఓపెన్ చెస్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొంటారని వెంకట సురేష్ తెలిపారు. విజేతలకు విద్యానిధి స్కూల్ ప్రిన్సిపాల్ మాధవి బహుమతులు అందజేశారు.

పేకాట క్లబ్‌పై దాడి

యానాం: ప్రభుత్వానికి చెందిన యానాం మున్సిపల్ లాడ్జిలో పేకాట క్లబ్ నిర్వహిస్తూ లక్షలాది రూపాయల మేర చేతులు మారుతున్న వైనంపై స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం అర్ధరాత్రి అధికారులు దాడులు నిర్వహించారు. కొన్ని నెలలుగా మున్సిపల్ లాడ్జిని కేంద్రంగా చేసుకుని యానాం, కాకినాడ, రాజమహేంద్రవరం, రామచంద్రపురం, మండపేట తదితర ప్రాంతాలకు చెందిన వందమంది పేకాట క్లబ్‌ను ప్రారంభించారు. గుట్టుచప్పుడు కాకుండా ఎవరికిచ్చే మామూళ్లు వారికిస్తుండటంతో పేకాట క్లబ్ సాఫీగా సాగిపోయింది. స్థానిక న్యూబస్టాండ్ పైన మున్సిపల్ లాడ్జి ఉండటంతో బస్సుల, ప్రయాణికుల హడావుడితో అధికసంఖ్యలో పేకాటరాయుళ్లు వచ్చినా ఎవరికీ తెలియలేదు. పోలీసులు సైతం పట్టించుకోకపోవడంతో అర్ధరాత్రి సైతం పేకాట నిరాటంకంగా సాగిపోతుండటంతో స్థానిక సోషల్ యాక్టివిస్ట్ శంకర కార్తీక్ మున్సిపల్ కమిషనర్ కె.రామకృష్ణకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన ఘటనా స్థలానికి రావడంతో పేకాటరాయుళ్లు పరారయ్యారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు, వారిపై చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ తెలిపారు. అయితే చాలా లాడ్జిల్లో పేకాట ఆడుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

'వక్ఫ్ చట్టం ఎవరికి చుట్టం' పుస్తకావిష్కరణ



మండపేటలో 'వక్ఫ్ చట్టం ఎవరికి చుట్టం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జమాత్–ఎ–ఇస్లామీ హింద్ నాయకులు

కపిలేశ్వరపురం (మండపేట): 'వక్ఫ్ చట్టం ఎవరికి చుట్టం' అనే పుస్తకాన్ని జమాత్–ఎ–ఇస్లామీ హింద్ రాష్ట్ర అధ్యక్షుడు మొహమ్మద్ రఫీఖ్ ఆవిష్కరించారు. మండపేట పట్టణం గాంధీనగర్ అల్–ఆమీన్ మస్జిద్‌లో మంగళవారం జమాత్–ఎ–ఇస్లామీ హింద్ మండపేట పట్టణ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ధార్మిక సమావేశంలో రఫీఖ్ పలు అంశాలను ప్రస్తావించారు. దేశంలో 20 కోట్ల మంది ముస్లింలు జరుపుకునే బక్రీద్ పండగ పాడిరైతులకు ఆర్థిక చేయూతనిస్తుందన్నారు. వక్ఫ్ చట్టంపై కేంద్ర ప్రభుత్వం తప్పుడు ప్రచారాన్ని చేస్తోందని, మేధావులు, ధార్మిక సంస్థలు, ప్రజాసంఘాలు శాస్త్రీయ దృక్పథంతో వక్ఫ్ చట్టాన్ని సమీక్షించాలని కోరారు. చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించే ఉద్దేశంతో 'వక్ఫ్ చట్టం ఎవరికి చుట్టం' పేరుతో ప్రచురితమైన పుస్తకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్నామన్నారు. కార్యక్రమంలో జమాత్–ఎ–ఇస్లామీ హింద్ స్థానిక కమిటీ అధ్యక్షుడు ఫారుఖ్ అలీ, జిల్లా అధ్యక్షుడు అబుల్ ఆలా, అల్– ఆమీన్ మస్జిద్ అధ్యక్షుడు రహీం, జమియా మస్జిద్ అధ్యక్షుడు అల్తాఫ్, ముస్లిం జేఏసీ నాయకులు ఎండీ కరీం, సయ్యద్ ఇబ్రాహీం షరీఫ్, షేక్ ఇబ్రాహీం, కరీం పాల్గొన్నారు.

ఐటీఐ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం

రాయవరం: కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైందని కాకినాడ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎం.వేణుగోపాలవర్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులందరికీ కాకినాడ ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించగా, మొదటి రోజు 80 మంది హాజరు కాగా, వారిలో 76 మందికి వారు కోరుకున్న ట్రేడ్‌లో సీట్లు కేటాయించినట్లు తెలిపారు.

ప్రమాదపుటంచున ప్రయాణం



కాజులూరు మండలం గొల్లపాలెంలో విద్యుత్‌వైర్లను సైతం తాకేలా ప్రమాదపుటంచున ప్రయాణిస్తున్న యువకులు

కాజులూరు: కాలువలకు నీరుకట్టివెయ్యటంతో డెల్టా ప్రాంతంలో మట్టిపనులు జరుగుతున్నాయి. మండల గ్రామాలలోని పొలాల్లో మెరక పనులు నిర్వహించేందుకు దూర ప్రాంతాల నుంచి పొక్లెయిన్, జేసీబీలను ఇలా లారీలపై తరలిస్తున్నారు. ఈ సమయంలో పొక్లెయిన్ డ్రైవర్లు, క్లీనర్లు అదనపు ప్రయాణ ఖర్చులెందుకని ఇలా ప్రమాదపుటంచున ప్రయాణాలు సాగిస్తున్నారు.

రైల్వే బ్రిడ్జిల పరిరక్షణకు చర్యలు



పనులు పరిశీలిస్తున్న అడిషనల్ డివిజనల్ రైల్వే మేనేజర్ పీఈ ఎడ్విన్

రాజమహేంద్రవరం సిటీ: గోదావరి నదిపై గల ప్రతిష్టాత్మకమైన రోడ్ కమ్ రైల్వే బ్రిడ్జి, ఆర్చ్ బిడ్జిల పరిరక్షణకు అవసరమైన చర్యలు చేపట్టినట్లు అడిషనల్ డివిజనల్ రైల్వే మేనేజర్ పీఈ ఎడ్విన్ పేర్కొన్నారు. మంగళవారం రాజమహేంద్రవరంలో గల రెండు బ్రిడ్జిలను అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైల్వే వంతెనలపై జరుగుతున్న మౌలిక సదుపాయాల అభివృద్ధి పనుల నాణ్యత, భద్రతా తనిఖీని నిర్వహించామన్నారు. 2027 నాటికి సురక్షితమైన, బలమైన వంతెనలుగా తీర్చిదిద్దడానికి, రూ.115 కోట్ల మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. రోడ్ కమ్ రైల్ బ్రిడ్జ్ పై సురక్షితమైన ఫుట్‌పాత్‌లు ఏర్పాటు చేశామన్నారు. ఐకానిక్ ఆర్చ్ బ్రిడ్జిపై రూ.70 కోట్లతో కేబుల్ రీ ప్లేస్మెంట్ వర్క్ పూర్తి చేస్తున్నామన్నారు. భారతీయ రైల్వేలతో అవగాహన ఒప్పందం కింద రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధుల మద్దతును ఆశిస్తున్నామన్నారు. పలువురు రైల్వే అధికారులు పాల్గొన్నారు.

సచివాలయ సెక్రటరీపై ఫిర్యాదు



డీఎల్‌డీవో వీణాదేవికి సమస్య వివరిస్తున్న సచివాలయ సిబ్బంది

రాజమహేంద్రవరం రూరల్: రాజానగరం మండలం రాధేయపాలెం గ్రామ సచివాలయంలో జయబున్నీసా బేగం గ్రేడ్–5 హోదాలో సెక్రటరీగా పనిచేస్తున్నారు. ఆ సచివాలయంలో వారంతా ఒకే నోటిఫికేషన్‌లో నియమితులయ్యారు. దీంతో వారి మధ్య సీనియారిటీ సమస్య కూడా లేదు. అయితే, బేగంకు కొన్నాళ్ల క్రితం డ్రాయింగ్ అండ్ డిస్‌బర్సింగ్ ఆఫీసర్(డీడీవో)గా అదనపు బాధ్యతలు కేటాయించారు. డీడీవోగా సిబ్బంది జీతాల ఫైల్ సిద్ధం చేయడం ఆమె చేతిలోనే ఉంటుంది. ఈ నేపథ్యంలో తమను తీవ్ర వేధింపులకు గురి చేస్తున్నారని ఆ సచివాలయ సిబ్బంది రాజమహేంద్రవరం కలెక్టరేట్‌లోని డీఎల్‌డీవో, వార్డు, గ్రామ సచివాలయాల ఇన్‌చార్జి వీణాదేవిని కలిసి తమ గోడును వెళ్లబోసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. మే నెల జీతాలు నేటికీ రాలేదని బేగం ఫైల్ సిద్ధం చేయకపోవడమే అందుకు కారణమని డీఎల్‌డీవో దృష్టికి తీసుకెళ్లారు. బేగం వైఖరి పట్ల తీవ్ర అసహనం వ్యక్తం చేసిన డీఎల్‌డీవో సిబ్బంది ఫిర్యాదుపై సానుకూలంగా స్పందించారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి తక్షణ చర్యలకు సిఫారసు చేస్తామని హామీ ఇచ్చారు.

కాపులపై కేసులను తిరగతోడితే సహించం

ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం (మండపేట): కాపుల సామాజిక ఉన్నతికి ప్రాణప్రదమైన రిజర్వేషన్ల ఉద్యమ నేపథ్యంలో కాపులపై పెట్టిన కేసులను తిరగతోడేందుకు కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మంగళవారం ఓ ప్రకటనలో ఖండించారు. మరోసారి ఇలాంటి ప్రయత్నాలను చేస్తే రాష్ట్ర ప్రజలు కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే సత్తా లేక రాష్ట్రంలో సామాజిక సమస్యలను సృష్టించే స్థాయికి కూటమి ప్రభుత్వం దిగజారుతోందన్నారు. తుని ఆందోళన నేపథ్యంలో కాపులపై పెట్టిన కేసులను 2023 మే 1న విజయవాడ ఏడవ అదనపు మెట్రో పోలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు రద్దు చేస్తూ తీర్పు ఇచ్చిందన్నారు. కోర్టు ఇచ్చిన తీర్పును పునర్విచారణ చేయాలంటూ ప్రస్తుత కూటమి ప్రభుత్వం సోమవారం రాత్రి హడావుడిగా జీవో జారీ చేయాల్సిన అవసరం ఏమొచ్చిందన్నారు. కేంద్ర ప్రభుత్వ అధీనంలోని రైల్వే శాఖ పరిధిలోని కేసును రాష్ట్ర కూటమి ప్రభుత్వం ఎలా తిరగతోడుతుందని ప్రశ్నించారు. రాష్ట్రం మొత్తం మీద కూటమి ప్రభుత్వం అప్రజాస్వామికంగా పాలన సాగిస్తోందని, అదే వైఖరిని కాపు సామాజిక వర్గీయుల పట్ల అవలంబిస్తున్నట్టు స్పష్టమవుతోందన్నారు. ఇలాంటి చర్యలకు కూటమి ప్రభుత్వం మరోసారి పాల్పడితే ప్రజాక్షేత్రంలోనే ఎదుర్కొంటామని ఎమ్మెల్సీ తోట హెచ్చరించారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	22,500
గటగట (వెయ్యి)	20,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	21,500
గటగట (వెయ్యి)	19,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	14,500 – 15,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	14,500 – 15,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

ప్రభుత్వ ఆదేశాలు భేఖాతర్

మునికూడలి ర్యాంపులో ఆగని ఇసుక రవాణా



మునికూడలి ర్యాంపులో గోదావరి పరివాహక ప్రాంతంలో ఇసుక లారీలు, పొక్లెయిన్

సీతానగరం: జిల్లాలో 28 ఇసుక ర్యాంపులు నిలిపివేస్తున్నట్లు అధికారులు జారీ చేసిన ఉత్తర్వులను భేఖాతరు చేస్తూ మునికూడలి ర్యాంపు నుంచి ఇసుక తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. మండలంలోని ములకల్లంక రెవెన్యూ భూముల్లో ఇసుక తవ్వకాలు జరిపి కాటవరం ర్యాంప్ నుంచి, పక్కిలంక రెవెన్యూ భూముల్లో ఇసుక తవ్వకాలు జరిపి మునికూడలి ర్యాంపు నుంచి, రఘుదేవపురం, వంగలపూడి ర్యాంపుల నుంచి ఇసుక రవాణా జరుగుతోంది. ర్యాంపులను అక్టోబర్ వరకు నిలిపివేస్తున్నట్లు, ఇసుక తవ్వకాలు నిలిపివేయాలని సోమవారం కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. అయితే పక్కిలంక భూముల్లో ఇసుక తవ్వకాలు జరిపి లారీలపై మునికూడలి ర్యాంపు నుంచి రవాణా చేస్తున్నారు. గోదావరి నదీ గర్భంలో మూడు భారీ పొక్లెయిన్‌లతో ఇసుక తవ్వకాలు జరుపుతున్నారు. రాత్రి సమయంలో కూడా ఇసుక రవాణా జరుగుతోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తహసీల్దార్ ఎ.శ్రీనివాస్‌ను వివరణ కోరగా తక్షణమే ర్యాంపును నిలిపివేస్తామని తెలిపారు. అయితే మంగళవారం రాత్రి కూడా యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు జరిగాయి.